క్లుప్తంగా

ఘనంగా స్వాముల ఇరుముడి


ఇరుముడి కార్యక్రమం నిర్వహిస్తున్న గురుస్వామి శేఖర్

కేశంపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు కొద్దిరోజుల క్రితం అయ్యప్ప మాల ధారణ వేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శనివారం గురుస్వామి శేఖర్ ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమం జరిగింది. పూజల అనంతరం దేవాలయ కమిటీ చైర్మన్ రామ్మోహన్ రావు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు తిరుమలయ్యగౌడ్, పాండుగౌడ్, శ్యాంసుందర్‌రెడ్డి, ప్రవీణ్‌యాదవ్, పాండుయాదవ్, శేఖర్‌రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, అరవింద్, మీనాక్షి, అన్విక‌లతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళాలు


ఆలయ సభ్యులకు విరాళం అందజేస్తున్న భీమారం వీరేశం

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని గుండుకేరిలో శివాలయం, హనుమాన్ దేవాలయాల నిర్మాణానికి శనివారం పలువురు భక్తులు విరాళాలను అందజేశారు. ఫరూఖ్‌నగర్‌కు చెందిన భీమారం వీరేశం రూ.1లక్ష, కొక్కునూరి ప్రవీణ్ రూ.41వేలు, కౌన్సిలర్ ఈశ్వర్‌రాజు రూ.11వేలు, బీఏయం కళాశాల డైరెక్టర్ నాగరాజు రూ.11వేల విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

కొందుర్గు: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శనివారం జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్ తూంపల్లి, ఎల్కగూడ, ధర్మా తండా, చింతకుంట తండా తదితర గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాల్లో ఎన్నికల నిర్వహణకు గుర్తించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బంది కలగకుండా ఉండేలా చూడాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో వెలుతురు సరిగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


కేక్ కట్‌చేస్తున్న పాస్టర్లు

మొయినాబాద్: మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని శనివారం మండల పరిధిలోని చిలుకూరులో ఉన్న స్మార్ట్ ఫాంహౌస్‌లో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఏసుక్రీస్తును స్మరించుకున్నారు. చిన్నారులు ఆటాపాటలతో అలరించారు.

వీరేందర్‌రెడ్డి సేవలు మరువలేనివి

కేశంపేట: తెలంగాణ ఉద్యమకారుడిగా, న్యాయవాదిగా, ప్రజాప్రతినిధిగా తాండ్ర వీరేందర్‌రెడ్డి అందించిన సేవలను నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా ప్రజలు మరువలేరని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తాండ్ర వీరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్సీ పలువురు నాయకులతో కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, రాంచందర్‌నాయక్, రాంచంద్రయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

- విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- నూతన డైట్ మెనూ ప్రారంభం


షాద్‌నగర్: గురుకుల కళాశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణ శివారులోని నూర్ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ, పీజీ కళాశాలలో నూతన డైట్ మెనూ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలల్లో చదువుతున్న నిరుపేదల విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగానే నూతన మెనూ విధానాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని, సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువుల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సునీత, నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, బాల్‌రాజ్‌గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, దంగు శ్రీనివాస్‌యాదవ్, ముబారక్, ఖాదీర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి

శంకర్‌పల్లి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుదని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్సీ బాలుర, బాలికల హాస్టళ్ల విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలికల హాస్టల్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి భోజనం చేశారు. హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ గిరిరాజు, శంకర్‌పల్లి వైద్యాధికారి రేవతిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ వెంకట్రామిరెడ్డి,నాయకులు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.


శంకర్‌పల్లి: సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

నాణ్యమైన భోజనం అందించాలి

కొందుర్గు: ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి రియాజ్ సిబ్బందికి సూచించారు. శనివారం కొందుర్గు ఎస్సీ హాస్టల్‌లో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. అదేవిధంగా ఇంద్రానగర్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మెనూ వివరించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన, తహసీల్దార్లు రమేశ్‌కుమార్, జగదీశ్వర్, ఎంపీడీఓలు అనురాధ, ప్రవీన్‌కుమార్, ఎంపీఓ లాలయ్య, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కావలి రాజు, నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

షాద్‌నగర్‌రూరల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డీఎల్పీఓ మల్లారెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ కమ్మదనం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యుల్లత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వం డైట్ చార్జీల పెంపుపై ప్రిన్సిపాల్ విద్యుల్లత సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు, తల్లితండ్రులకు భోజనాన్ని అందించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారి సందీప్, పంచాయతీ కార్యదర్శి జగదీశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోనే మంచి భవిష్యత్

షాబాద్: చదువుతోనే విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటారని కందుకూరు డీఎల్పీఓ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ అపర్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కైట్ కళాశాలలో గల గురుకుల హాస్టల్‌లో న్యూ డైట్, చార్జీస్, కాస్మోటిక్ చార్జీల ప్రత్యేక డైట్ మెనూను వారు ప్రారంభించారు. హైతాబాద్ బాలికల హాస్టల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, పీఆర్ఏఈ సూర్యనారాయణ, షాబాద్, రాజేంద్రనగర్ ఎంఈఓలు శంకర్‌రాథోడ్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.


షాబాద్: మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న అధికారులు

డైట్ చార్జీల పెంపు హర్షణీయం

కేశంపేట: హాస్టళ్లలో విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు హర్షణీయమని అని మండల ప్రత్యేక అధికారి, ఏడీఏ రాజారత్నం అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని ప్రభుత్వ హాస్టల్‌లో కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజారత్నం మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా హాస్టల్ డైట్ చార్జీలు పెరగకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. డైట్, కాస్మోటిక్స్ చార్జీల పెంపుతో నిరుపేదలైన విద్యార్థులకు ఇబ్బందులు తొలగుతాయన్నారు. హాస్టల్ విద్యార్థులకు ఖచ్చితంగా నూతన మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజాంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, మండల విద్యాధికారి చంద్రశేఖర్, సీఐ నరహరి, ఏపీఓ కిష్టయ్య, ఏపీఎంభగవంతు, హాస్టల్ వార్డెన్ రాధాకృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రమేశ్, శ్రీధర్‌రెడ్డి, గిరియాదవ్, కరుణాకర్‌రెడ్డి, పెంటయ్య, పర్వతాలు, భీమయ్య, రాజేందర్, మనోహర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కేశంపేట: మెనూ ప్రారంభిస్తున్న ప్రత్యేకాధికారి రాజారత్నం

నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యం

షాద్‌నగర్ రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఐఏఎస్ అధికారి గౌతమ్ అన్నారు. శనివారం పట్టణ శివారులోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రభుత్వం అమలు చేసిన నూతన డైట్‌ను ఐఏఎస్ అధికారి గౌతమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో కిచెన్, వంట సామగ్రి గదితో పాటుగా విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పౌష్టిక విలువలతో కూడిన భోజనాన్ని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని చదువుల్లో రాణించాలన్నారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు ఎదిగి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్ శ్రావణి, ఎంఈఓ మనోహర్, డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌సింగ్, ప్రిన్సిపాల్ అనుష, తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్ రూరల్: వంటగదిని పరిశీలిస్తున్న ఐఏఎస్ అధికారి గౌతమ్

కార్మికులందరూ ఐక్యంగా ఉండాలి

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ


సమావేశంలో పాల్గొన్న యూనియన్ నాయకులు, కార్మికులు

చేవెళ్ల: కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులు, కార్మికులపై దాడులు పెరిగాయని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. మండలంలోని అనెక్స్ గ్లాస్ కంపెనీ వద్ద శనివారం ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి డి.శివయ్య అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పెట్టుబడిదారి విధానాన్నికి కొమ్ముకాస్తూ పోరాడి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చారని విమర్శించారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి హక్కులను కాపాడుకోవాలన్నారు. రైతులు, కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉండేది పార్టీ సీపీఐని, పార్టీ సభ్యత్వ నమోదులో కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో చేరాలని కోరారు. ఈ సందర్భంగా కార్మికులందరినీ పార్టీ సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో కార్మికులు నర్సింలు, శ్రీను, పురుషోత్తం, ఇంద్రారెడ్డి, మాధవరెడ్డి, ప్రశాంత్ గోపాల్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు

అధ్వానంగా మరుగుదొడ్లు


చిలుకూరు గురుకుల పాఠశాలలో మరుగుదొడ్ల దుస్థితి

మొయినాబాద్: కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవం జరిగిన చిలుకూరు గురుకులంలో మరుగుదొడ్ల దుస్థితి అధ్వానంగా ఉంది. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా చిలుకూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. ఆ పక్కనే ఉన్న మరుగుదొడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. సీఎం వచ్చిన సందర్భంగా అయినా మరుగుదొడ్లు బాగుపడలేదు. కార్యక్రమానికి హాజరైన కొందరు మరుగుదొడ్ల దుస్థితిని చూసి ముక్కునవేలేసుకున్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని ఠాగూర్ పాఠశాల ఆడిటోరియంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. గత పాలకులు విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన కొద్ది నెలల్లోనే విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేట్టారన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టారని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాములయ్య, అర్జున్‌రెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగిరం

మేయర్ చిగురింత పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజలలో వేల కోట్లతో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లోని రఘుహోమ్స్ కాలనీలో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట శ్రీధర్‌రెడ్డి, గూడెపు ఇంద్రసేనా, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, బంగారి శంకర్, మురళీమోహన్, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం



లోక్ అదాలత్‌లో కేసులను పరిశీలిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

- రిటైర్డ్ జడ్జి సాంబశివుడు
- మొత్తం 521 కేసుల పరిష్కారం, జరిమానాలు రూ.8,23,300

చేవెళ్ల: పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసమే న్యాయ సేవాధికార సంస్థ లోక్ అదాలత్‌లను తీసుకొచ్చిందని రిటైర్డ్ జడ్జి సాంబశివుడు అన్నారు. మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో గత ఆరురోజులుగా ట్రాఫిక్ కేసులపై కొనసాగుతున్న లోక్ అదాలత్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా చివరిరోజు చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పలు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. ఆరురోజుల ఈ లోక్ అదాలత్‌లో మొత్తం 521 కేసులు పరిష్కరించగా.. ఇందులో 192 కేసులు మద్యం తాగి వాహనాలు నడిపించిన కేసులు పరిష్కరించబడ్డాయని చెప్పారు. అన్ని కేసులకు సంబంధించి జరిమానాలు రూ.8,23,300లు విధించినట్లు తెలిపారు. ట్రాఫిక్ పెండింగ్ కేసుల పరిష్కారం కోసం ఈ ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సూపరింటెండెంట్ మహిపాల్, సూపరింటెండెంట్ బి.కృష్ణవేణి, కార్యదర్శి బి.సత్యానందం, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కె.కుమార్, న్యాయవాది మల్లేశ్‌గౌడ్, ప్రవీన్, కోర్టు సిబ్బంది, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్2 పరీక్షలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు

హయత్‌నగర్: టీజీపీఎస్సీ నిర్వహించనున్న గ్రూప్–2 పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం సోమ, మంగళవారం ప్రత్యేక బస్సులు తిప్పనున్నామని హయత్‌నగర్–1 డిపో మేనేజర్ విజయ్ శనివారం తెలిపారు. ఇందుకోసం ఎల్‌బీనగర్, హయత్‌నగర్ బస్టాండ్లలో ప్రత్యేక హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. మజీద్‌పూర్‌లోని అవంతి, కేవీకే కళాశాలలకు కుంట్లూర్ పల్లవి ఇంజనీరింగ్ కళాశాలల పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఎల్‌బీనగర్ నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సును నడపనున్నామని, దీనిని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాల ని ఆయన సూచించారు.

ఐక్యతతో డిమాండ్లు సాధించుకుందాం

కురుమ సంఘం మండల అధ్యక్షుడు పాండు

షాబాద్: కురుమలు పార్టీలకతీతంగా ఐక్యతతో తమ డిమాండ్లను సాధించుకోవాలని సంఘం మండల అధ్యక్షుడు మద్దూరు పాండు అన్నారు. మండలం నుంచి దొడ్డి కొమురయ్య కురుమల ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవానికి శనివారం నాయకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుమలందరూ ఏకతాటిపైకి వచ్చి తమ డిమాండ్లను సాధించుకోవాలన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో ముందుకుసాగాలని సూచించారు. మండంలోని అన్ని గ్రామాల్లో కురుమ సంఘం కమిటీలు ఏర్పాటు చేవాలని సూచించారు. కురుమలు ప్రజాప్రతినిధులుగా గ్రామాల్లో ప్రజలకు సేవలందిస్తున్నారని, ఇంకా ఎక్కువ మొత్తంలో రాజకీయాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కేశంపేట: మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామంలో ఉన్న కేజీబీవీలో కామర్స్, నర్సింగ్ బోధించేందుకు ఉపాధ్యాయ పోస్టులకు గాను అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మండల విద్యాధికారి చంద్రశేఖర్ శనివారం తెలిపారు. కేజీబీవీలో పీజీసీఆర్‌టీ కామర్స్, పీజీసీఆర్‌టీ నర్సింగ్‌లో ప్రస్తుత విద్యాసంవత్సరంలో విద్యాబోధన చేసేందుకు అతిథి ఉపాధ్యాయులు అవసరమన్నారు. పీజీసీఆర్‌టీ కామర్స్ ఎంకామ్ విద్యార్హత, పీజీసీఆర్‌టీ నర్సింగ్‌కు జీఎన్ఎం లేదా బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత కలిగినవారు ఈ నెల 18 వరకు కేజీబీవీ ఎస్ఓ గౌసియాకు దరఖాస్తులను అందించాలని తెలిపారు.

ప్రయోగాలతో మేధోశక్తి పెంపు


మాట్లాడుతున్న పాఠశాల చైర్మన్ భువనేశ్వర్

షాద్‌నగర్ రూరల్: పాఠశాల స్థాయిలో చేసే ప్రయోగాలు విద్యార్థులలో మేథోశక్తిని పెంపొందిస్తాయని ఇండియన్ హైట్స్ పాఠశాల చైర్మన్ సజ్జల భువనేశ్వర్ అన్నారు. శనివారం పట్టణ శివారులోని ఇండియన్ హైట్స్ పాఠశాలలో అధ్యక్షురాలు ద్రాక్షాయణి ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన ప్రయోగాలు ఎంతగానో ఆలోచింపజేశాయి. అనంతరం పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. పట్టుదలతో నిరంతరం శ్రమిస్తే విజయ తీరాలకు చేరుకుంటారన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతులుగా ఎదిగి భవిష్యత్‌కు బంగారుబాటలు వేసుకోవాలన్నారు. విద్యార్థులు విషయ పరిజ్ఞానంతో కూడిన విద్యనభ్యసించి కొత్త ఆలోచనలతో నవభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు మహేశ్, జగదీశ్వర్, అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తా


స్వామివారి పల్లకీసేవలో పాల్గొన్న ఎమ్మెల్సీ, భక్తులు

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

షాద్‌నగర్: ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో పల్లకీసేవ, గోసేవ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ..ఈ హనుమాన్ దేవాలయం ఎంతో చారిత్రాత్మకమైనదన్నారు. స్వామివారు భక్తుల కోరికలు తీరుస్తూ, భక్తుల పాలిట కొంగు బంగారంగా నిలుస్తున్నారన్నారు. దేవాలయ అభివృద్ధికి తనవంతు సహాయం అందజేస్తానన్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో అయ్యప్ప భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, మాజీ సర్పంచ్ ఉమాదేవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.